GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 27-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



రాజ్యాంగాన్ని చేదవాలి.. హక్కులను సాధించుకోవాలి

ం ఏఐఎస్ఎస్టి మాజీ జాతీయ చైర్మన్ సాయమ్మోల్ల చంద్రయ్య
ం మనుధర్మానికి ప్రత్యామ్నాయం భారత రాజ్యాంగం
ం సమానత్వ సమాజానికి మార్గదర్శకంరాజ్యాంగం
ం రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత: డా. ముప్పారం ప్రకాశం,
ం దౌల్తాబాద్‌లో "భారత రాజ్యాంగం- బహుజనుల స్థితిగతులు" అంశంపై సామాజిక సదస్సు
ం ముఖ్య అతిథులుగా పాల్గొన్న తహసీల్దార్ పర్వీన్ షైక్, ఎస్సై శ్రీధర్ రెడ్డి

8

గిరిజనుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత

ం గిరిజనుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత
ం గొప్ప కట్టడంగా సేవాలాల్ మందిర నిర్మాణం
ం మద్దిమడుగు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



గిరిజనుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మద్దిమడుగులో నిర్మించనున్న సంతు సేవాలాల్ మందిరం దేశంలోనే గొప్ప కట్టడంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగులో పర్యటించిన ముఖ్యమంత్రి అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో లంబాడీల ఆరాధ్య దైవం సంతు సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడమే కాక ఆయన జీవిత విశేషాలు తెలియజేస్తూ వివిధ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. దేశంలోని ఎన్నో పార్టీలు గిరిజనులను ఓటు బ్యాంకుగా వాడుతున్నాయని, ఇందిరమ్మ మాత్రమే మీలో ఉన్న పేదరికం, మీలో ఉన్న చైతన్యాన్ని, మీలో ఉన్న పట్టుదలను, మీలో ఉన్న పోరాట పటిమను గుర్తించి మీకు సమానమైన అవకాశాలు ఇవ్వాలనీ అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పించి గిరిజనులకు సొంత పొలాలు కల్పించడం జరిగిందన్నారు.

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్)

మిగతా 2లో

నాటు సారా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం..!

ం ఎక్సైజ్,ఎన్‌ఫోర్స్‌మెంట్,డీటీఎఫ్,ఎస్టీఎఫ్ బృందాలు సంయుక్త దాడులు
ం హుజూర్‌నగర్ స్టేషన్ పరిధిలో విస్తృత ఎక్సైజ్ దాడులు
ం 55 లీటర్ల నాటుసారా స్వాధీనం...14 మందిని అరెస్టు
ం 10 మందిపై బైండోవర్ కేసులు 5 మండలాలు, సుమారు 30 గ్రామాలలో తనిఖీలు
ం చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు... అధికారులు హెచ్చరిక



క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ : అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి , సూర్యాపేట ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల బృందాలతో పాటు, ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్గొండ, డీటీఎఫ్ సూర్యాపేట,ఎస్టీఎఫ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించారు.డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అవినాష్ మొహంతి, జాయింట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ,జి. అంజన్ రావు ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత పర్యవేక్షణలో రెండు రోజులు హుజూర్‌నగర్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, అక్రమ నిల్వలు ,విక్రయాల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించారు.

మిగతా 2లో

గిరిజనుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత





(మొదటి పేజీ తరువాయి)

గిరిజనులు చదువుకొని విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో దేశానికి ఆదర్శంగా నిలబడాలని మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ భావించారని తెలిపారు. ఈ ప్రాంతవాసి మాజీ కేంద్రమంత్రి దివంగత జయపాల్ రెడ్డి 1976లో ప్రత్యేక చట్టంతో బహుజనుల జాబితాలో ఉన్న గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఆనాటి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారన్నారు. లంబాడీల జాతి ఆనాడు బ్రిటిష్ దొరలను భయపెట్టిన జాతి అని, నిటారుగా నిలబడి ఎదుర్కొని బ్రిటిష్ వాళ్ళని గడగడలాడించిన ఘనత మీకు దక్కుతుందన్నారు. నిజాం నవాబును ఎదుర్కొన్న తెగువ మీ సొంతమని, తెలంగాణ సాయుధ రైతాంగ సమరంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి పోరాటం చేస్తుంటే రజాకార్లు ఆయనను వేటాడుతున్నప్పుడు మీ తండాలలో ఆయనకు ఆశ్రయమిచ్చి కాపాడిన ఘనత గిరిజనుల సొంతమని స్పష్టం చేశారు. ఎస్టీ రిజర్వేషన్ ద్వారా ఎంతోమంది గిరిజనులు డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో మంత్రులుగా, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా రాణించారన్నారు. ఎస్టీలకు రిజర్వేషన్ లు కల్పించడం వలనే నేడు వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. దున్నేవాడికే భూమి ఇవ్వాలన్న ఆలోచనతో పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు10 నుంచి 12 లక్షల ఎకరాల భూములను లంబాడా సోదరులకు పంచిపెట్టిన ఘనత ఇందిరమ్మకే చెలుతుందన్నారు. అందుకే ఏ తండాకి వెళ్ళిన, ఏ లంబాడ సోదరుని ఇల్లు తలుపు తట్టిన ఆ ఇంట్లో ఇందిరమ్మ ఫోటోతో పాటు సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలు ఉంటాయన్నారు. చాలామంది గిరిజనులు ఆనాడు తన బిడ్డలకు ఇందిరమ్మ పేరు పెట్టారని, ఈ తరంలో ప్రియాంక గాంధీ పేరు పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లలో మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఎస్టిలకు, ఎస్సీలకు కేటాయించడం జరిగిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఏ పథకంలో అయినా గిరిజన సోదరుల యొక్క బతుకు బాగుండాలనీ, వాళ్ళు దేశ అభివృద్ధిలో, సేవలో గొప్పగా రాణించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తాను పుట్టి, పెరిగిన ప్రాంతం నల్లమల అని, కొండారెడ్డిపల్లి బిడ్డనని చెప్పుకున్నప్పుడల్లా గొప్పగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు కష్టపడే తత్వం కలిగిన వారని, మాట నిలబెట్టుకునే తత్వం నాకు ఈ ప్రాంతం నుంచే అబ్బిందనీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో డాక్టర్ వంశీకృష్ణను గెలిపించండని, అచ్చంపేటకు ఒక్కరు కాదు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారు ఒకటి వంశీకృష్ణ అయితే, రెండవది రేవంత్ రెడ్డి అని చెప్పడంతో ప్రజలు 50 వేల మెజార్టీతో వంశీకృష్ణను గెలిపించారని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి రూ.450 కోట్ల నిధులు తీసుకువచ్చి, సంతు సేవాలాల్ మహారాజ్ యొక్క గొప్ప ఆలయాన్ని నిర్మించడమే కాక ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ కలిపి ఉండేదని, ఈనాడు ఎస్సీలకు, ఎస్టీలకు ప్రత్యేకమైన కమిషన్ ను వేరువేరుగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అచ్చంపేటలో వంతెన నిర్మాణంతోపాటు మిగతా అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని తెలిపారు. అచ్చంపేట లిఫ్టు ద్వారా ఈ ప్రాంతంలో ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా దిండి రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. మునుగోడు, దేవరకొండకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇచ్చేందుకు 0.1 టిఎంసి సామర్థ్యం నుంచి 0.6 టిఎంసి సామర్థ్యానికి పెంచుతూ కృష్ణానది జలాలను సరఫరా చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. సేవాలాల్ ఆశీస్సులతో లంబాడి సామాజిక వర్గం, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం, సంత్ సేవాలాల్ గిరిజన భవన నిర్మాణం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతమైన మద్దిమడుగు లో 16 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం, మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ నిర్మాణాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో గిరిజనుల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ....

చాకలి ఐలమ్మ, పండుగ సాయన్న వంటి మహనీయులకు గుర్తింపు కల్పిస్తూ ప్రభుత్వం సమాజంలో మార్పు తీసుకొచ్చే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావడం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు.

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ...

సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కి గిరిజన ప్రజల నుండి ఎంపీ ధన్యవాదాలు తెలిపారు .

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...

రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే విధంగా మద్దిమడుగు సమీపంలోని కృష్ణా నదిపై వంతెన నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరారు. నల్లమల ప్రాంతానికి ముఖ్యమంత్రి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నల్లమల ముద్దుబిడ్డగా రేవంత్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహా శంకుస్థాపన తో పాటు మద్దిమడుగు ఆంజనేయ స్వామి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారని అందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ... సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణంతో మద్దిమడుగు ప్రాంతం గిరిజనుల ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. లంబాడీ గిరిజనుల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... లంబాడీ భాషలో ప్రసంగిస్తూ, గిరిజనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి గిరిజన సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కి గిరిజన ప్రజల నుండి అయన ధన్యవాదాలు తెలిపారు . ఖఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచందర్ నాయక్, అదనపు కలెక్టర్ బి చెన్నయ్య, సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర, ఇతర అధికారులు, గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెబ్బేరు మాంటిస్సోరీ విద్యార్థుల విజయం

వనపర్తి నవంబర్ 26 క్రైమ్ మిర్రర్: వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-10, అండర్-12, అండర్-14 అథ్లెటిక్స్ పోటీల్లో పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని మాంటిస్సోరీ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రన్నింగ్, లాంగ్ జంప్ తదితర క్రీడా విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డి. రాజేందర్ గౌడ్ విజేత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీఈటీ తులసిరామ్, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఈటీ తులసిరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం..!

ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ స్టేషన్ పలు మండలాల్లో మట్టంపల్లి, గరిడేపల్లి, మేళ్లచెరువు, పాలకీడు , చింతలపాలెం మండలాల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు.

మట్టంపల్లి మండలం: కొత్త తండా, పాత తండా, బడవ తండా, భిల్యా నాయక్ తండా, నిమ్మ తండా,బాబ్లా తండా, యాతవకిళ్ల, కామంచికుంట తండా సుల్తాన్‌పురం తండా, అవిరేణికుంట తండా, తుమ్మల తండా.

గరిడేపల్లి మండలం: మంగాపురం తండా, లచ్య తండా, రేగులగడ్డ తండా, సీతల తండా, చిన్న గారకుంట తండా

మేళ్లచెరువు మండలం: హేమ్లా తండా, కప్పలకుంట తండా

పాలకీడు మండలం: బెట్టే తండా, కల్మెట్ తండా, శూన్యంపహాడ్. చింతలపాలెం మండలం: చింతలపాలెం, తమ్మారం, పీక్లా నాయక్ తండా, నక్కగూడెం, ఎర్రకుంట తండా. 55 లీటర్ల నాటుసారా స్వాధీనం.14 మందిని అరెస్టు

ఈ దాడుల సందర్భంగా అక్రమ నాటుసారా తయారీకి వినియోగించే ముడి పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు, నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న పులిసిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడం జరిగింది.

బెల్లం -- 40 కిలోలు,సుమారు 2900 లీటర్ల పులిసిన బెల్లం పానకం ధ్వంసం.55 లీటర్ల నాటుసారా స్వాధీనం,అక్రమ నాటుసారా తయారీ మరియు ఇతర ఎక్సైజ్ నేరాలకు సంబంధించి 28 కేసులు నమోదు చేయగ మొత్తం 14 మందిని అరెస్టు చేయడం జరిగింది.10 మంది వ్యక్తులపై బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగింది.



తెలంగాణ ప్రజాశక్తి పార్టీ లో వివిధ పార్టీల కార్యకర్తలు చేరిక

ం అతి త్వరలో రైతుల పక్షాన పాదయాత్ర చేపట్టడం జరుగుతుంది.

ం తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అధ్యక్షులు-దొడ్ల వెంకట్

క్రైమ్ మిర్రర్,సదాశివపేట: సదాశివపేట పట్టణంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన 10మంది ముఖ్య కార్యకర్తలు నవీన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ సమక్షంలో చేరడం జరిగింది. పార్టీ అధ్యక్షులు వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ... తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక ఉచిత హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విపరమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని రేవంత్ రెడ్డి ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయాడని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన ఆమెను నెరవేర్చి ప్రజల దృష్టిలో మాట నిలుపుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాపూర్ అంగన్వాడీ కేంద్రాలలో ఘనంగా సామూహిక శ్రీమంతాలు...!

జగిత్యాల జిల్లా బ్యూరో క్రైమ్ మిర్రర్) గొల్లపల్లి మండలం ?తిరుమలాపూర్ గ్రామంలోని 1, 2, 3 అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు పసుపు, కుంకుమలు, గాజులు, పూలు, పండ్లు అందించి ఒడిబియ్యం పోసి ఆశీర్వదించారు. అనంతరం గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రక్తహీనత నివారణ మరియు ఆరోగ్య జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశ అంజలి గంగాధర్, వార్డు మెంబర్ ఒబులపురం లచ్చయ్య, ఏఎన్ఎం (ూచేవీ) చిలుకమ్మ, ఆశా కార్యకర్తలు ఉమ, వసంత, అంగన్వాడీ టీచర్లు శ్రీ లాల్ బి హరిత.రజిత. రేషన్ డీలర్ రమదేవి,గర్భిణీలు తల్లులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్

క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం: భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ ,సమానత్వం , సామాజిక న్యాయాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ అన్నారు గురువారం నారాయణపురం మండలం కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. దేశంలో బావ ప్రకటన స్వేచ్ఛ సమానత్వం, సామాజిక న్యాయాన్ని అన్ని రంగాలలో విధ్వంసం చేసి సహజ న్యాయ సూత్రాలకు భిన్నంగా పరిపాలన సాగిస్తున్నారని ప్రశ్నించే గొంతుకులను అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వ సంస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాల వ్యాప్తిని పెంపొందించి రాజ్యాంగ పీఠికలో సెక్యులర్ , సోషలిస్ట్ అనే పదాలను తొలగించి రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు పన్నుతున్నారని దాని తిప్పి కొట్టడానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పోరాడి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన అన్నారు. రాజ్యాంగం అందించిన ఫలాలు 75 ఏళ్లు దాటిన ఇంకా అందరికీ అందడం లేదని ధనవంతులు ఇంకా ధనవంతులవుతున్నారని దేశంలో పేదరిక



నిరుద్యోగం పెరిగి యువత విద్యార్థులు పెడదారిన పడుతున్నారని ఉండటానికి ఇల్లు తినడానికి తిండి చదువుకోవడానికి నాణ్యమైన విద్య కల్పించవలసిన బాధ్యత పాలకుల మీద ఉన్నది కానీ నేడు ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటు వ్యక్తులకు దార దత్తం చేసి భారత సమైక్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు సుర్వి నరసింహ, ఎఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు దుబ్బాక సంజీవ, పులమోని శంకర్ పందుల యాదగిరి, గుండు నరసింహ సింగపంగ రమేష్, జనగాం శంకరయ్య , భీమనపల్లి గాలయ్య , ఈద మల్లయ్య, చింతకింది వీరయ్య , మొగుదాల సత్తయ్య, రాపర్తి పెంటయ్య , పల్లె రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

కరెంటు స్తంభాలు ఇవ్వడానికి ఏడాది కాలం చాలదా?

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై సీపీఎం ఆగ్రహం.. గ్రామ పంచాయతీ ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన

పది రోజుల్లో ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైంది? తక్షణమే విద్యుత్ స్తంభాలు ఇవ్వాలి: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడానికి ఏడాది కాలం కూడా సరిపోలేదా? అంటూ ట్రాన్స్‌కో అధికారుల తీరుపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నూనెగూడెం గ్రామంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు విషయంలో అధికారుల జాప్యాన్ని నిరసిస్తూ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ.. గ్రామంలో అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి, ట్రాన్స్‌కో గుండాల ఏఈ, మోత్కూరు ఏడీఈతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఏడాది కావస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత అక్టోబర్‌లో నిర్వహించిన గ్రామసభలో ట్రాన్స్‌కో ఏఈ అంబాల నర్సింహను విద్యుత్ స్తంభాల సమస్యను ప్రస్తావించగా, పది రోజుల్లోనే స్తంభాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి ఇంతకాలం గడిచినా పనులు ప్రారంభించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. గ్రామసభల్లో విద్యుత్ పొదుపుపై ప్రజలకు సూచనలు చేసే అధికారులు, పగటిపూట గ్రామాల్లో వీధి దీపాలు వెలుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నూనెగూడెం గ్రామానికి అవసరమైన విద్యుత్ స్తంభాలను తక్షణమే మంజూరు చేసి ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి గుండాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మద్దెపురం రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండారు సాలమ్మ, మద్దెబోయిన సోమయ్య, కాసం మల్లయ్య, మలిపెద్ది కొండల్ రెడ్డి, రంగు నర్సమ్మ పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం.. అంబేద్కర్‌కు నివాళులు

మునుగోడు క్రైమ్ మిర్రర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు అంబేద్కర్ చిత్రపటం ఎదుట చేతులు జోడించి నమస్కరించి ఆయన సేవలను స్మరించుకున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఈ సందర్భంగా గుర్తుచేశారు.



రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు యువత కృషి చేయాలి.

క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా : ఖమ్మం నగరంలోని సమర్థనం దివ్యాంగుల సంస్థ శిక్షణ కేంద్రంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి యువజన సంఘాల సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్ పాల్గొని ప్రసంగించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడిరెక్క ఉమాశంకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కల్పించిందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలవడానికి రాజ్యాంగమే పునాది అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు తమ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26 ని రాజ్యాంగ



దినోత్సవం జరుపుకోవడం ఒక్కటే కాదు సమాజంలో ఉన్న అసమానతలను తొలగించే దిశగా యువత ఆలోచనలు ఉండాలి అన్నారు. ముఖ్యంగా యువత రాజ్యాంగంలోని సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే అంబేద్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సటైల్ ఐటీ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అవులూరి సౌమ్య, ట్రైనర్ మరియు మేనేజర్ కల్లేపు అఖిల, కమ్యూనికేషన్ ట్రైనర్ రచ్చ సతీష్ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి.. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర పిలుపు

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర అన్నారు. 77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం గుండాల మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే అన్యాయాలు, అక్రమాలు, అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తుతామని స్పష్టం చేశారు. కుల, మత, భాషా భేదాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను



పెంపొందిస్తూ రాజ్యాంగ ఆశయాలను భావితరాలకు అందించాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు జి. వెంకన్న, ఆంధ్రయ్య, పుల్లయ్య, చంద్రయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో జిల్లా స్థాయి 'చెకుముకి' సైన్స్ సంబరాలు

ం 17 మండలాల నుంచి 60 జట్లు హాజరు

ం విజేతలకు డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు అవకాశం

ం వివరాలు వెల్లడించిన జేవీవీ

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. సత్యం, పర్వతాలు

క్రైమ్ మిర్రర్,ఆమనగల్లు: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'చెకుముకి సైన్స్ సంబరాలు--2026'లో భాగంగా ఈ నెల 28వ తేదీ శనివారం రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు డి. సత్యం, ప్రధాన కార్యదర్శి పర్వతాలు ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్‌లోని ఠాగూర్ హైస్కూల్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఈ సంబరాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడిస్తూ.. 8, 9, 10వ తరగతుల విద్యార్థుల కోసం నవంబర్ 12న పాఠశాల స్థాయిలో నిర్వహించిన పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6 లక్షల మంది, రంగారెడ్డి జిల్లాలోని 17 మండలాల నుంచి 19 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అనంతరం నవంబర్ 21న మండల స్థాయిలో ఎంపికైన 60 జట్లు (180 మంది విద్యార్థులు) ఇప్పుడు జిల్లా స్థాయి పోటీల్లో తలపడనున్నారని చెప్పారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి అక్కడే ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక:

జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచే నాలుగు జట్లు (ప్రభుత్వ పాఠశాలల తెలుగు, ఇంగ్లీష్ మీడియం విభాగాల నుంచి రెండు జట్లు, ప్రైవేట్ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం నుంచి ఒక జట్టు, రెసిడెన్షియల్ విభాగం నుంచి ఒక జట్టు) రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని వివరించారు. ఈ జట్లు డిసెంబర్ 11 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు.



లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : శంకర్‌పల్లిలోని లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంజిత్ కుమార్, 1వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సంజిత్ కుమార్ సూచించారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనంద్ కుమార్, అర్చన, శిరీష, రతన్ కుమారి, ప్రబంధ, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద కుటుంబం సొంతింటి కలకు కల వెంకటేష్ చేయూత

నిలిచిపోయిన ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేత

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఆర్థిక ఇబ్బందులతో సొంతింటి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చిన ఓ నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అండగా నిలిచారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు గాంధీనగర్ కాలనీకి చెందిన మహ్మద్ హాజీ ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మహ్మద్ హాజీ ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఈ విషయాన్ని 14వ వార్డు కౌన్సిలర్ బావాండ్ల మంజుల, మధు, కల్వకుర్తి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బావాండ్ల మధు ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సిమెంట్ అందజేసి ఇంటి నిర్మాణం పూర్తయ్యేందుకు సహకారం అందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉప్పల వెంకటేష్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బావాండ్ల మధు, కల్వకుర్తి మున్సిపల్ మాజీ స్పెషల్ నాలెడ్జ్ పర్సన్ కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు దాచేపల్లి శ్రీనివాసులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భగత్ సింగ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, గంప శ్రీనివాసులు, ఊర్కొండ సర్పంచ్ మేకల మంజుల శ్రీనివాసులు, వెంకటాపురం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, విష్ణు, కంఠం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





అచ్చంపేట సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

క్రైమ్మిర్రర్,ఆమనగల్లు: అచ్చంపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఆమనగల్లు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో అవ్వారి శివలింగం, పోతుగంటి శంకర్, వస్పుల శ్రీశైలం, ఎంగలి ప్రసాద్, మాల్యా నాయక్, పూతల వెంకటేష్, విజయ నాయక్, సురేష్ నాయక్, పులికంటి మైసయ్య, వస్పుల శ్రీకాంత్, ఎండీ ఫరీద్, సుమన్, వెంకటేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆశయాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకెళ్లాలి

పలిమెల, నవంబర్ 26 (క్రైమ్ మిర్రర్): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువల పరిరక్షణే ప్రతి పౌరుడి బాధ్యత అని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం పలిమెల మండల అధ్యక్షుడు పాగె రాజేష్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలిమెల మండలం పంకెన గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన అవసరంలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో రూపొందించిన భారత రాజ్యాంగం దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగంలోని హక్కులు, విధులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

యువత చదువును ఆయుధంగా మలుచుకుని అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అండగా నిలిచి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాగె వైకుంఠం, ఉప సర్పంచ్ మేకల రాజక్క, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎర్ని సుధాకర్, ప్రధాన కార్యదర్శి పాగె సంతోష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పాగె పొట్టయ్య, వార్డు సభ్యుడు దస్తగిరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కృష్ణగిరి పాదాలగుట్టకు హైదరాబాద్ భక్తుల రాక

ం శ్రీ గురుగ్రహ శివలింగానికి ప్రత్యేక అభిషేక పూజలు-పురాతన ఆలయాల అభివృద్ధిలో నరేష్ సేవలు అభినందనీయం



క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి : శంకర్‌పల్లి మండల పరిధిలోని కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రాన్ని గురువారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన కృష్ణకుమారి భక్త బృందం సందర్శించింది. గ్రహదోష నివారణ కోసం ప్రతిష్ఠించిన శ్రీ గురుగ్రహ శివలింగానికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ కర్త, బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం రంగారెడ్డి జిల్లా జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్. నరేష్ కుమార్, గ్రామ పెద్దలు ఆర్. రామలక్ష్మయ్య, ముదిరాజ్ జంగయ్య, భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ.. సనాతన పురాతన ఆలయాలను గుర్తించి, వాటి అభివృద్ధికి నరేష్ కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రహదోషాలు, సమస్యలతో బాధపడే భక్తుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మారుమూల ప్రాంతమైన కృష్ణగిరి పాదాలగుట్టపై గురుగ్రహ శివలింగాన్ని ప్రతిష్ఠించడం గొప్ప ఆలోచనని, తెలంగాణలోనే ఇది ప్రత్యేకమైన క్షేత్రంగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి పురాతన ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా, గతంలో నరేష్ కుమార్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన చెందిప్ప మరకత శివలింగ ఆలయంలో ప్రస్తుత పరిస్థితులపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో అభిషేకాలు ఉచితంగా నిర్వహించేవారని, ప్రస్తుతం అభిషేకానికి రూ.200 టికెట్ తీసుకోవాలని చెప్పడంతో పాటు, కనీసం నీళ్లు పోసి అభిషేకం చేసుకునేందుకు కూడా అనుమతించలేదని కృష్ణకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ ధర్మం పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. శ్రీ శివలింగం, నందీశ్వర విగ్రహాల స్థాపనకు విరాళాలు అందించిన వంశీధర్ రెడ్డి, వాణి, తాత కందివనం, నరసింహారెడ్డి, పెద్దబావి పోచయ్య, కార్తీక్, స్నేహలను భక్త బృందం ప్రత్యేకంగా అభినందించింది.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

ం రూ.18 లక్షల పరిహారం డబ్బుల కోసమే ఘాతుకం

ం మాడ్గుల హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

ం ఇద్దరు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు



క్రైమ్ మిర్రర్, ఆమనగల్లు (మాడ్గుల): పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద వచ్చిన రూ.18 లక్షల పరిహారం డబ్బులను కాజేయడంతో పాటు, తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను దారుణంగా హత్య చేయించింది. సంచలనం సృష్టించిన ఈ హత్య కేసును మాడ్గుల పోలీసులు ఛేదించి, నిందితులను కటకటాల వెనక్కి పంపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23న మాడ్గుల మండలం అవురుపల్లి శివారులోని చిన్న నెమిలిలా గుట్ట వద్ద చెట్ల పొదల్లో కుళ్లిపోయిన స్థితిలో ఓ గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో ఫీల్డ్ అసిస్టెంట్ సయ్యద్ నజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసు ఆధారంగా మృతుడిని జడ్చర్ల మండలం ఉద్దండాపురానికి చెందిన గజ్జె మల్లికార్జున్ గా గుర్తించారు.

మద్యం తాగించి బండరాయితో మోది..

కాల్ డేటా, సాంకేతిక ఆధారాలతో అవురుపల్లికి చెందిన బన్నె శివను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. మల్లికార్జున్ భార్య అంజమ్మతో శివకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల ఇల్లు కోల్పోయినందుకు మల్లికార్జున్‌కు ప్రభుత్వం నుంచి రూ.18 లక్షల పరిహారం అందడంతో, ఆ డబ్బుతో ఇద్దరూ కలిసి జీవించాలని పథకం వేశారు.ఇందులో భాగంగా ఈ నెల 20న మల్లికార్జున్‌ను జడ్చర్లలోని వైన్స్ వద్దకు పిలిపించి మద్యం తాగించిన శివ, అనంతరం బైక్‌పై అవురుపల్లి శివారులోని చిన్న నెమిలిలా గుట్ట వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మల్లికార్జున్‌కు మరింత మద్యం తాగించి మత్తులోకి వెళ్లిన తర్వాత బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని పొదల్లో పడేసి మృతుడి ఫోన్, బైక్‌తో పరారయ్యాడు. మృతుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లను కేసులో చేర్చారు. నిందితులు బన్నె శివ, అంజమ్మలను బుధవారం అరెస్ట్ చేసి ఆమనగల్లు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు మాడ్గుల సీఐ వెల్లడించారు.

ప్రజల సేవ కోసం రాజకీయాలా... లేక ప్రజల, ప్రభుత్వ సొమ్ములను దోచుకొని టానికా, కూడబెట్టిన వేలకోట్ల ఆస్తుల రక్షణకా



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: నేడు రాజకీయాలు ప్రజల సేవ కోసమా, లేక ప్రజల మరియు ప్రభుత్వ సొమ్ములను దోచుకోవడానికా, ఆ అక్రమ సంపాదనతో కూడబెట్టిన వేలకోట్ల ఆస్తుల రక్షణ కోసమా అనే ప్రశ్న ప్రతి సామాన్యుడిలో తలెత్తుతోందని బిసిపై పార్టీ తెలంగాణ పీఏసీ సభ్యులు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ప్రజల కష్టాలను గాలికి వదిలేసి, కేవలం వ్యక్తిగత సామ్రాజ్యాలను కాపాడుకోవడానికే కొందరు అధికారాన్ని వాడుకుంటున్నారని ఆయన నిలదీశారు. పేదవాడు కుటుంబాన్ని పోషించుకోవడానికి నిత్యం పోరాడుతుంటే, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర ధరల పెరుగుదల, విద్య, వైద్యం, ఇంటి అద్దెలు, ఈఎంఐ ల భారంతో నలిగిపోతుంటే ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు ఏం చేస్తున్నారని ఉమ్మడి వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న భారీ అప్పుల వల్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం లేదు, రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కానీ ఆ అప్పుల భారాన్ని మాత్రం పన్నులు, ఛార్జీల రూపంలో తిరిగి సామాన్యుడిపైనే మోపడం ఎంతవరకు న్యాయమని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ నిప్పులు చెరిగారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన బాధ్యుల నుంచి ఆ నష్టాన్ని ఎందుకు రాబట్టడం లేదని, వేల కోట్ల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన బడా బాబులపై సామాన్యుడిపై చూపినంత కఠినత్వం ఎందుకు చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, శ్మశాన వాటికలు, ప్రజా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని సమాజ సేవకులు, ప్రజా హక్కుల పోరాట యోధులు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ నిలదీశారు. ప్రజల పన్నులతో జీతాలు తీసుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, తక్షణమే ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను చట్టప్రకారం తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు కేవలం రేషన్ బియ్యం ఇవ్వడమే కాకుండా, వారిని పేదరికం నుంచి శాశ్వతంగా బయటపడేయడానికి ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, మధ్యతరగతికి విద్య, వైద్యం, గృహ నిర్మాణంలో రాయితీలు ఇవ్వాలని బీసీపై పార్టీ నాయకులు మరియు ఉమ్మడి వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఎమ్మెల్సీ అభ్యర్థి డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మద్యం ఆదాయం కోసం కుటుంబాల భవిష్యత్తును బలి చేసే విధానాలను పాలకులు పునరాలోచించాలని, ప్రజలందరూ చైతన్యవంతులై తమ హక్కుల కోసం ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. "ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల సమయంలో ఓట్లు అడగడం మాత్రమే కాదు... ఎన్నికల తర్వాత ప్రజలకు జవాబుదారీగా ఉండడం! ప్రజల సొమ్మును దోచుకొని కూడబెట్టిన అక్రమ ఆస్తులను కాపాడుకునే రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రజలపై అప్పుల భారం మోపే విధానాలను మార్చాలి.

భగవద్గీత శ్లోకాలతో రాష్ట్రస్థాయి బరిలోకి కల్వకుర్తి చిన్నారులు

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహం

శిక్షణ అందించిన గురువులకు ఘన సత్కారం



క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి: భగవద్గీత కంఠస్థ పోటీల్లో కల్వకుర్తి విద్యార్థులు ప్రతిభ చాటుతూ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న భగవద్గీత పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులతో పాటు వారికి శిక్షణ అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. కల్వకుర్తిలోని శ్రీ లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ట్రస్టీ కల్వ మనోహర్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వశీకర్, వేదసాయి, సాహుతేజ్, ప్రకృతి విద్యార్థులను, వారికి భగవద్గీతలో శిక్షణ అందించిన గురువులు సుకన్య, వసుంధర, స్వప్నలను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రో చ్చారణలతో ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కల్వ మనోహర్ మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా దేవాలయంలో వేసవి శిబిరాల ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు గతంలో వివిధ సంస్థలు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులతో పాటు ప్రశంసలు అందుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలను నేర్పించడంలో గురువులు సుకన్య, వసుంధర, స్వప్న చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. చిన్న వయసులోనే భగవద్గీతను నేర్చుకోవాలనే ఆసక్తితో పట్టుదలగా సాధన చేస్తున్న విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భీమారంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ విజయలక్ష్మి



భీమారం, నవంబర్ 26 (క్రైమ్ మిర్రర్): భీమారం గ్రామపంచాయతీ పరిధిలోని రైతుల సౌకర్యార్థం రైతు వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ ఉష్కమల్ల విజయలక్ష్మి, పున్నం చందు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులందరూ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తమ ధాన్యాన్ని ఈ కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాజ్యలక్ష్మి, వీఓఏలు బొంతల లక్ష్మి, శైలజ, హమాలీలు పాల్గొన్నారు.



ఎమ్మెస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సాయికుమార్ మాదిగ

రామకృష్ణాపూర్, నవంబర్ 26 (క్రైమ్ మిర్రర్) : మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్ఎఫ్) మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన మారపల్లి సాయికుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని స్నేహ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెస్ఎఫ్ ఇన్‌ఛార్జి డాక్టర్ కొమ్ము శేఖర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరి విష్ణు మాదిగ, ఉపాధ్యక్షుడిగా మారపల్లి సాయికుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధనతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

మృతుని తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు: ఎస్సై కురుమూర్తి

క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి: కల్వకుర్తి పట్టణంలోని అశోక్ నగర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కాల రాము (31) అనే యువకుడు గురువారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని మృతి చెందాడు. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మృతుడు రాము డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా మద్యం సేవిస్తూ భార్య రమణ (28)తో తరచూ గొడవ పడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజుల క్రితం భార్య రమణ తన ముగ్గురు పిల్లలతో కలిసి శుభకార్యం నిమిత్తం వందూరుకు వెళ్లింది. దీంతో రాము ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాము ఉరివేసుకుని మృతి చెందాడు అని ఎస్సై కురుమూర్తి తెలిపారు. మద్యం మత్తులోనే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని మృతుడి తల్లి పోలీసులకు తెలిపింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండలం ఏలికట్టే గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ యువజన నాయకుడు ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ జన్మదినం సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ శాలువా తో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బోడిగే అంజయ్య గౌడ్, నల్లమాస ధనుంజయ్ గౌడ్, అంతటి నరేష్ గౌడ్, బత్తుల రాజేష్, సిద్దగోని రమేష్, బత్తుల శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక మాసంలో.. 'సంకష్టహర చతుర్థి'

- విఘ్నేశ్వరుడి ఆరాధనకు ప్రత్యేక పర్వదినం

- భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు, ఉపవాసాలు, చంద్రదర్శనం



క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: కార్తీక మాసం ఆధ్యాత్మిక విశిష్టతతో నిండిన పవిత్ర మాసం. శివకేశవుల ఆరాధనకు అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో ప్రతి రోజూ భక్తులు దీపారాధన, పూజలు, వ్రతాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. ఈ క్రమంలో శుక్రవారం కార్తీక బహుళ చతుర్థి సందర్భంగా సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించనున్నారు.

విఘ్నాలు తొలగించే వినాయక ఆరాధన

సంకష్టహర చతుర్థి రోజున గణపతి స్వామిని పూజించడం విశేషంగా భావిస్తారు. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు, కష్టాలు తొలగి సుఖసంతోషాలు కలగాలని భక్తులు విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి, సాయంత్రం గణపతి పూజ నిర్వహించి, చంద్రదర్శనం అనంతరం వ్రతాన్ని ముగించడం సంప్రదాయంగా వస్తోంది. కార్తీక మాసం కేవలం పూజలు, వ్రతాలకే పరిమితం కాకుండా మనిషిలో ఆత్మపరిశీలన, క్రమశిక్షణ, దైవభక్తి, సేవాభావాన్ని పెంపొందించే కాలంగా భక్తులు భావిస్తారు. దీపారాధన ద్వారా చీకటిని తొలగించి వెలుగును ఆహ్వానించినట్లే, మన జీవితాల్లోని అజ్ఞానం, అహంకారం, ప్రతికూల ఆలోచనలను తొలగించుకోవాలని ఈ మాసం ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. భక్తి, విశ్వాసం, సత్ప్రవర్తనతో ప్రతి రోజును పవిత్రంగా గడపాలని కార్తీక మాసం భక్తులకు గుర్తుచేస్తోంది.

అమెజింగ్ టెంపుల్ రామప్ప

ం రామప్ప దేవాలయంను సందర్శించిన జపాన్ దేశస్తురాలు

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 26: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని గురువారం జపాన్ దేశానికి చెందిన టోమోకీ టజానా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ అమెజింగ్ టెంపుల్ అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు అరుణ్, శ్రీకాంత్, బద్రు, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



మద్దిమడుగు ఆంజనేయస్వామి సన్నిధిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన వేద పండితులు..

స్వామివారి ఆశీస్సులు పొందిన ముఖ్యమంత్రి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్): నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగు పుణ్యక్షేత్రంలోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సందర్శించారు. రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌లతో కలిసి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు, అర్చకులు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణకుంభంతో ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గర్భాలయంలో కొలువుదీరిన మూలవిరాట్ శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకుని భక్తితో నమస్కరించారు. ముఖ్యమంత్రి పేరిట ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వామివారి ఆశీస్సులు పొందారు. మద్దిమడుగు పుణ్యక్షేత్రంలో భక్తి భావం, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య ముఖ్యమంత్రి పర్యటన సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.



పీఆర్సీ వెంటనే ప్రకటించి అమలు చేయాలి

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి డిమాండ్





క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచారి డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయడంతో పాటు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మోత్కూర్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ గుండాల మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, గెస్ట్ ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేలు వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు అందించాలని, కేజీబీవీలలో కేర్‌టేకర్లను నియమించి ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని పిలుపునిచ్చారు.

"మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక"

మహాసభ అనంతరం టీఎస్‌యూటీఎఫ్ గుండాల మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొల్లపూడి రాజ్‌కుమార్ పాల్, ప్రధాన కార్యదర్శిగా పులకరం వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బీరం వెంకట్రాంరెడ్డి, గోపిశెట్టి జ్ఞానప్రసన్న, కోశాధికారిగా బత్తుల లింగయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా దైదా వీరయ్య, దూళిగా వసుంధర, మహిళా కన్వీనర్‌గా భైరగాని లావణ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎం.డి. ఫహీం ఎన్నికయ్యారు.

"జిల్లా మహాసభలకు తరలిరావాలి"

ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు డిసెంబర్ 6న పోచంపల్లిలో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దర్శనం వెంకన్న, ఎన్నారం సత్తయ్యతో పాటు పలువురు సీనియర్ ఉపాధ్యాయ నాయకులు

రాజ్యాంగాన్ని చదవాలి.. హక్కులను సాధించుకోవాలి

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 26: భారత రాజ్యాంగం మనుధర్మానికి ప్రత్యామ్నాయంగా సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే విలువలను అందించిందని సాహసం రాష్ట్ర అధ్యక్షుడు డా. ముప్పారం ప్రకాశం అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం 77వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని దళిత జర్నలిస్టుల ఫోరమ్ (డిజెఎఫ్) మండల కమిటీ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని ఆర్‌పీఎస్ మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం “భారత రాజ్యాంగం -- బహుజనుల స్థితిగతులు” అనే అంశంపై సామాజిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య ప్రసంగం చేసిన డా. ముప్పారం ప్రకాశం మాట్లాడుతూ.. వేల సంవత్సరాలుగా కొనసాగిన మనుధర్మ భావజాలానికి ప్రత్యామ్నాయంగా కుల వివక్షకు తావులేని సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కొందరు అసత్య ప్రచారాలు చేస్తూ ఆయన ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్‌ను విమర్శించే ముందు ఆయన రచనలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర, దేశానికి చేసిన సేవలను అధ్యయనం చేయాలని సూచించారు. భారత రాజ్యాంగం కేవలం బహుజనుల కోసమే కాకుండా దేశంలోని ప్రతి కులం, మతం, వర్గం, పౌరుడి హక్కులను పరిరక్షించే ప్రజాస్వామ్య పత్రం అని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవిస్తూ అదే రాజ్యాంగాన్ని అవమానించడం సమర్థనీయం కాదన్నారు. ప్రతి కుటుంబానికి రాజ్యాంగ గ్రంథాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, పాఠశాల స్థాయి నుంచే రాజ్యాంగ విలువలు, పౌర హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.



రాజ్యాంగాన్ని చదవాలి.. హక్కులను సాధించుకోవాలి

నేటి బహుజన సమాజం రాజ్యాంగాన్ని చదివి, అర్థం చేసుకుని, అందులో పొందుపరిచిన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఎవరి దయాదాక్షిణ్యాలు కావని, అవి ప్రజాస్వామ్య హక్కులని పేర్కొన్నారు. వాటిని కాపాడుకోవడం మన బాధ్యత, భావితరాలకు అందించడం మన కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సాయమ్మోల్ల చంద్రయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీనియర్ జర్నలిస్ట్, సర్పంచ్ బి. శ్రీహరి సభకు అధ్యక్షత వహించారు. స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డి రాజ్యాంగం ఏర్పాటు, అమలు తీరు గురించి వివరించారు. తహసీల్దార్ పర్వీన్ షైక్ రాజ్యాంగ ఆవిర్భావం, కుల వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. అలాగే రమేష్ ఆధ్వర్యంలోని కళాకారుల బృందం అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాలను వివరిస్తూ పాటలు ఆలపించి సభికుల్లో ఉత్తేజాన్ని నింపింది. పలువురు సామాజిక ఉద్యమ నాయకులు, యువకులు, ప్రజలు ఈ సదస్సులో పాల్గొన్నారు. మనుధర్మం అసమానతలను బోధిస్తే.. భారత రాజ్యాంగం సమానత్వాన్ని చాటుతుందని, మనుషులను కులాలుగా విడదీసే భావజాలానికి బదులుగా పౌరులుగా ఏకం చేసే శక్తి రాజ్యాంగానికి ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ రాష్ట్ర నాయకుడు మీనంపల్లి కిషన్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు ముక్కగల్ల యాదన్న, ప్రధాన కార్యదర్శి వరిగుంతం శంకర్, మండల అధ్యక్షుడు మద్దెల పొచన్న, ప్రధాన కార్యదర్శి పరమేషుల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

వనపర్తి నవంబర్ 26 క్రైమ్ మిర్రర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి గొప్ప విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ కులమతాలకు అతీతంగా సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారపోగు వెంకటేష్, ఉప సర్పంచ్ పెద్దింటి నందీశ్వర్, వార్డు సభ్యులు మాల సతీష్, దేవర్ల అరుణ, బీసుపల్లి, దాది రాముడు, బొంగు ఆశన్న, దాది శేఖర్, కటికల బీసన్న, కావలి కురుమన్న, పింజరి సర్వర్, బాలయ్య గౌడ్, గొల్ల చంద్రాయుడు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కార్మిక హక్కుల పరిరక్షణకు చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపులి

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో : కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు . గురువారం ఖమ్మంలోని యూటీఎఫ్ భవనంలో కళ్యాణ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మార్పులు కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం కార్మిక వర్గానికి నష్టం కలిగిస్తున్నాయని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం కూడా పనిగంటలను 10 గంటలకు పెంచుతూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని పేర్కొన్నారు . నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనాన్ని రూ.42 వేలకు పెంచాలని పెన్షన్‌ను రూ. 21 వేలకు నిర్ణయించాలని స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. వెంకటేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ జిల్లా నాయకులు చలమల విఠల్ పిన్నెటి రమ్య వై. విక్రమ్ పేరుమాళ్లపల్లి మోహన్‌రావు ముధం శ్రీనివాస్ భూక్య శ్రీనివాసరావు శీలం నరసింహారావు మరగంటి తిరుమలాచార్యులు జలావరపు మంగ జిల్లా ఉపేందర్ ముత్తుమల్ల ప్రసాద్ కోటేశ్వరి తదితరులు మండల కన్వీనర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలే సింగరేణి ప్రగతికి సోపానం: జీఎం ఎన్. రాధాకృష్ణ

మందమర్రి, నవంబర్ 26 (క్రైమ్ మిర్రర్) : భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు హృదయం వంటిదని, ప్రతి పౌరుడు అనుసరించాల్సిన ప్రాథమిక విలువలు, హక్కులు, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించిన గొప్ప పత్రం ఇదని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలను జీఎం ఎన్. రాధాకృష్ణ ప్రారంభించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన భారత రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి ప్రగాఢ పరిజ్ఞానం, దూరదృష్టి, సమానత్వ భావజాలం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించడానికి రాజ్యాంగం ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పీఓ కార్తీక్‌లతో పాటు జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

